క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



బీరప్ప ఆలయం వద్ద ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: మండలంలోని నాగులపల్లిలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికచింతన అలవర్చుకుంటే ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, నాయకులు సాయి ప్రసాద్ యాదవ్, దేవేందర్ యాదవ్, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ సభకు ఎమ్మార్పీఎస్ నేతలు



ఎమ్మార్పీఎస్ సభకు వెళ్తున్న నాయకులు

కేశంపేట: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ శంషాబాద్‌లో తలపెట్టిన సభకు మండలం నుంచి ఆ సంఘం నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ గొంతును పార్లమెంట్‌లో వినిపించే విధంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరుతూ సభను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. శంషాబాద్‌కు వెళ్లిన వారిలో జిల్లా కో–కన్వీనర్ సురేష్, మండల అధ్యక్షుడు శ్రీను, నాయకులు నర్సింహ, రాజు, యాదయ్య, రాములు, రమేష్, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో సొంత డబ్బులతో నిర్మించిన బురుజు మైసమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమ్మవారి ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలు అశ్విని, ఎంపీటీసీలు పీ జయమ్మ, చెన్నయ్య, అశోక్, నాయకులు ఆంజనేయులు, రవీందర్‌నాయక్, కిషోర్‌నాయక్, దశరథ్, రవీందర్‌నాయక్, కిరణ్, జంగయ్య, శ్రీనివాస్, కుమార్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



తిర్మలపూర్ కంటి వెలుగు శిబిరంలో సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, వైద్య సిబ్బంది

షాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిర్మలపూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో మేలు ఇస్తుందన్నారు. కంటి జబ్బులను నయం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి సునీల పాల్గొన్నారు.

నేడు ఆలయ ప్రారంభోత్సవం

దౌల్తాబాద్: నందారంలో శనివారం నూతన శివాలయం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మహాదేవమ్మ తెలిపారు. శివాలయంతో పాటు ధ్వజస్తంభం, నందీశ్వరుడు, శివలింగం, గణపతి, సుబ్రహ్మణ్యం, నాగులవిగ్రహాల ప్రతిష్ఠాపన చేయనున్నట్లు చెప్పారు. 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ సంక్షేమ సంబురాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. తద్వారా రాష్ట్రం అభివృద్ధిలో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకునేందుకు కేసీఆర్ ప్రత్యేక చర్యలు చేపట్టారని అన్నారు. కులవృత్తుల వారిని ఆదుకునేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. అదేవిధంగా పేద విద్యార్థులను నాణ్యమైన బోధన చేసేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. విదేశీ విద్యనభ్యసించే విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. సాగు, తాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం చేపట్టడంతో పాటు, ప్రాజెక్టులను నిర్మిస్తోందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా చౌదరిగూడ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రిజర్వాయర్‌కు గోదావరి జలాలను కూడా అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో ప్రత్యేక అధికారి వెంకట్, జెడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, నాయలకులు కే నరేందర్, ఎంఎస్ నట్‌రాజన్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రమించే వారికి పదవులు ఖాయం



కాంతిరెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా కాంతిరెడ్డి

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో మండలంలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన జీ కాంతిరెడ్డిని బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ.. పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు లభిస్తాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంతిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ఎమ్మెల్యే యాదయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు పీ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, నాయకుడు బీ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు సరే.. సమస్యల మాటేంటి?

అధికార పార్టీని నిలదీసిన పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న శంకర్

కొందుర్గు: బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేయడం కాదు ముందుగా ప్రజా సమస్యలు పరిష్కరించాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్ తండాను సందర్శించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదని, నీటి సమస్య ఉందని స్థానికులు వాపోయారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి దశాబ్ది ఉత్సవాల పేరుతో విందులు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. తండాలకు తాగునీరు, రోడ్డు వసతి కల్పించకపోవడం బాధాకరమన్నారు. గతంలో పార్టీ నాయకులకు దళిత బంధు ఇచ్చారని, ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కులవృత్తుల పేరుతో బీసీలకు లక్ష రూపాయలు ఇస్తామని ఆశ చూపుతున్నారని ఆరోపించారు. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకమేనన్నారు. ఇలాంటి నాటకాలు ఎన్ని ప్రదర్శించినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కే రాజు, కృష్ణారెడ్డి, నాయకులు శివకుమార్, రాజా నర్సింహారెడ్డి, దామోదర్, వెంకటయ్య, ఖలీల్, వేణుగోపాల్, రవి, అన్వర్, భాస్కర్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘లక్ష్మీదేవిపల్లి’ నిర్మించే వరకూ పోరాటం

నవ తెలంగాణ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య



రిలే నిరాహార దీక్షలో నవ తెలంగాణ చైతన్య సమితి నాయకులు

షాద్‌నగర్ రూరల్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించే వరకు పోరాటం చేస్తామని నవ తెలంగాణ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు టీ నర్సయ్య అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని కోరుతూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే ఇక్కడి ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు నర్సింహాచారి, నాయకులు నర్సయ్య, విజయ్‌కుమార్, శేఖర్‌గౌడ్, చెన్నయ్య, రామస్వామి, గోపాల్, శ్రీను, కృష్ణచారి, అంజయ్య, దర్శన్, అంజమ్మ, పద్మజ, వరలక్ష్మి, మనీలా, గౌసియాబేగం, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన భద్రతే లక్ష్యంగా పాలన

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



కులాంతర వివాహం చేసుకున్న జంటకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: ప్రజల జీవన భద్రతే లక్ష్యంగా బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలన సాగిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలోని వీరయ్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది సంక్షేమ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా 125 చెరువులను రూ. 50.32కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రైతు బీమా పథకం కింద 1,064 మంది లబ్ధిదారులకు రూ. 53కోట్ల 20లక్షలు అందజేసినట్లు చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా 20 ట్యాంకులు, 881 కిలో మీటర్ల పైపులైన్లు వేసినట్లు వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, సీఎం రిలీఫ్ ఫండ్ పథకాల కింద రూ. 135 కోట్లు లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. బీసీలకు లక్ష రూపాయల రుణ చెక్కులు, గొల్ల కురుమలకు రెండో విడుత గొర్రెల పంపిణీకి సంబంధించిన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, ప్రశాంతి, మహేందర్‌రెడ్డి, నక్షత్రం, ఆర్డీఓ మేణుమాధవ్‌రావు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సుపరిపాలన దినోత్సవం

కొడంగల్ : రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెలంగాణ సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, వాటి ఫలితాలను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్, అంజయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: బీసీల ఆర్థిక పురోగతికి సీఎం కేసీఆర్ లక్ష రూపాయల సాయం చేయడం అభినందనీయమని ఆరెకటికెల సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం శివాజీ చౌక్ వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఇన్‌చార్జ్ ప్రభాకర్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల్లో ఎలాంటి సహాయం పొందనిది ఆరెకటికెలు అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సీఎం కేసీఆర్ కులవృత్తుల వారికి లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం సాయం వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివాజీ, బందులాల్, జగన్, శివ, ప్రవీణ్, కిషన్, బాలాజీ, శివాజీ, శంకర్ జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన మందిరాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

కొడంగల్ రూరల్: హిందూ, ముస్లిం దేవాలయాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక మక్కా మసీద్‌లో మాట్లాడారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రార్థనాలయాలకు ఉచిత విద్యుత్తును అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జబ్బార్‌సాబ్, సయ్యద్ ఇసాక్, జావెద్ హుస్సేన్, సయ్యద్ హనీఫ్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి
- ప్రజాగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామస్వామి తదితరులు

మొయినాబాద్ రూరల్: తొమ్మిదేళ్ల పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను తుంగలో తొక్కాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి చౌరస్తాలో సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జనం భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రభుత్వాలు కేసులు పెడుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్తిరెడ్డి, మక్బుల్, అఫ్సర్, మహేందర్‌రెడ్డి, నరేందర్, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు మంజుల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: అన్నదాతల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచడంపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం షాద్‌నగర్ మార్కెట్ యార్డులో బీజేపీ నేతలు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు పెంచిందన్నారు. అదేవిధంగా సబ్సిడీల కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒక్కసారి రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని ఆరోపించారు. 9ఏళ్లుగా రైతులకు సీఎం కేసీఆర్ అన్యాయమే చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రైతు రుణ మాఫీ నేటికీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేసి లక్ష ఎకరాలకు నీరందిస్తామని చెప్పి నేటికి ఒక్క ఎకరాకు నీటిని సరఫరా చేయలేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, నాయకులు డీ అశోక్‌గౌడ్, బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాలాచారి, వంశీకృష్ణ, సాయిబాబ, ఎం మురళీ, నర్సింహాయాదవ్, కుర్మయ్య, సుధాకర్, ఏ ప్రదీప్, శ్యాంసుందర్, శ్రీనివాస్‌చారి, నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అంజయ్య, నరేష్, నర్సింహ, లింగం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: మండలంలోని అమ్డాపూర్ జేబీఐటీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ 2023 పేరిట శుక్రవారం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేబీఐటీ విద్యా సంస్థల క్యాంపస్ అధికారి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 30 కళాశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సి.కృష్ణమాచారి, సిబ్బంది కార్తికేయన్, డాక్టర్ నీరజ, ఎన్ విఘ్నేష్, చంద్రసింగ్, ప్రశాంత్, విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపూస ఆపరేషన్ విజయవంతం

చేవెళ్ల: స్థానిక పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన వెన్నుపూస ఆపరేషన్ విజయవంతం అయినట్లు ఆస్పత్రి ఇన్‌చార్జ్ వినోద్ రెడ్డి తెలిపారు. చేవెళ్లకు చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు బ్యాక్ పెయిన్‌తో ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. ఆమె వెన్నుపూసలో సమస్య ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేసినట్లు వివరించారు. ఆరోగ్య శ్రీ కింద ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సర్జరీని సక్సెస్ చేసిన వైద్యులు వంశీ, ప్రవీణ్, సాయి, రాజేశ్, రాజు, షబీర్, చంద్రశేఖర్ పలువురు అభినందించారు.

సకాలంలో పంట రుణాలు

- పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి
- రూ.65 లక్షలతో ఎరువుల గోదాం ప్రారంభం



ఎరువుల గోదాంను ప్రారంభిస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్: రైతులకు సకాలంలో పంట రుణాలు ఇస్తామని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి చెప్పారు. శుక్రవారం సంఘం పరిధిలో రూ.65.48లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన ఒక వెయ్యి మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జులై మొదటి వారంలో రైతులకు ఖరీఫ్ పంట రుణాలు అందజేస్తామని, ఎకరాకు రూ.50వేల చొప్పున ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు ఇస్తామన్నారు. అవసరం, అర్హులైన రైతులకు ట్రాక్టర్ రుణాలు, కోళ్ల ఫారమ్ కోసం బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామని వెల్లడించారు. సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా మొండి బకాయి చెల్లించాలని చెప్పారు. గత ఏడాది రూ.45 లక్షల వరకు ఎరువులు అందజేశామని, ఈ ఏడాది యూరియ 500 టన్నులు, డీఏపీ 100 టన్నులు, పొటాష్ 100 టన్నులు, కాంప్లెక్స్100 టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. తట్టెపల్లి పీఏసీఎస్‌తో పాటు నాగులపల్లి, ఇందూరు గ్రామాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ మనోహర్, సీఈఓ రాజమౌళి, ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, ఉప సర్పంచ్ కిష్టప్ప, సూపర్ వైజర్ రాములు, పాలకవర్గం సభ్యులు బస్వరాజ్, శ్రీదేవి, చుక్కమ్మ, హన్మంతు, రహీం, దిగంబరం, మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్, గ్రామస్తులు వీరేశం, సంజప్ప, సిబ్బంది రాములు, జగదీశ్వర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ సమాజ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: వీరశైవ సమాజ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెప్పారు. వీరశైవ సమాజ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆయన ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు ఆర్ బస్వరాజ్, గౌరవ అధ్యక్షుడు వాలి శాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు సడిగి భద్రప్ప, ప్రధాన కార్యదర్శి లింగదల్లి రవికుమార్, సహాయ కార్యదర్శి అబులం సంపత్, కోశాధికారి వాలి శ్రావణ్‌కుమార్, నిర్ని చంద్రశేఖర్, గంగా శ్రావణ్ కుమార్‌లు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ 25 ఏళ్లుగా వీరశైవ సమాజ అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, రవిగౌడ్, వడ్డే శ్రీనివాస్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి